# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 18 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఆర్టీసీలో 1,743 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- అక్టోబర్ 8 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ)లో 1,743 పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీస్ నియామక మండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో వెయ్యి డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ పోస్టులు ఉన్నాయి. అక్టోబరు 8 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. డ్రైవర్ పోస్టులకు 22 నుంచి 35ఏండ్లు, శ్రామిక్ పోస్టులకు 18 నుంచి 30 ఏండ్ల వరకు వయోపరిమితిని నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరి వారికి 5 ఏండ్లు, మాజీ సైనికోద్యోగులకు మూడేండ్లు వయో పరిమితి సడలింపు ఉంటుందని తెలంగాణ పోలీస్ నియామక మండలి తెలిపింది. స్కిల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. జిల్లాల వారీగా పోస్టుల వివరాలు, జీతభత్యాలను నోటిఫికేషన్‌లో పొందుపర్చారు. పూర్తి వివరాలకు తెలంగాణ పోలీస్ నియామక మండలి అధికారిక వెబ్‌సైట్ www.tgprb.inలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### తెలంగాణ అభివృద్ధికి

# అందరం భాగస్వాములం కావాలి





- రైతు సంక్షేమానికి రూ.20,616 కోట్ల రుణమాఫీ
- తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- ఏడాదిలోనే లక్షా నాలుగు వేల కోట్లు రైతుల కోసం ఖర్చు చేసిన ప్రభుత్వం
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లు.. త్వరలో రాష్ట్ర విద్యా పాలసీ
- మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి నినాదంతో ఆర్థిక సాధికారత
- సన్నబియ్యం పథకంతో 3.10 కోట్ల మందికి లబ్ది
- కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా కోసం పోరాటం
- మూసీ పునరుజ్జీవన, గాంధీ సరోవర్ ప్రాజెక్టులు త్వరలో
- మెట్రో రెండో దశలో 76.4 కిమీ కొత్త మార్గం
- 360 కి.మీ రీజినల్ రింగ్ రోడ్-రీజినల్ రింగ్ రైల్‌కు కేంద్రం అంగీకారం
- బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టు ప్రగతిలో
- "తెలంగాణ రైజింగ్ 2047" దార్శనిక పత్రం డిసెంబర్ 9న విడుదల
- సీఎం రేవంత్ రెడ్డి పిలుపు
- ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా పబ్లిక్ గార్డెన్స్‌లో త్రివర్ణ పతాక ఆవిష్కరణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్ష మేరకు ఆవిష్కృతమైన తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు అభివృద్ధి సాధించుకోకపోతే భవిష్యత్ తరాలకు తీరని నష్టం చేసిన వారిగా మిగిలిపోతామని అన్నారు. "తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములమ వుదాం. అందుకు అందరం ప్రతిజ్ఞ తీసుకుందాం. ఈ తెలంగాణను ప్రపంచంతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దుకుందాం. ఎజెండాలు, జెండాలు పక్కన పెట్టి ప్రభుత్వం ప్రణాళికా బద్ధం చేస్తున్న అభివృద్ధిలో కలిసిరండి. ఈ ప్రభుత్వం ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది.

ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదం అండగా ఉన్నంత కాలం ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపిస్తాం. ఈ రోజు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతానని, అందుకు మీ అందరి సహకారం, ఆశీర్వాదం ఉండాలి" అని ప్రజాపాలన దినోత్సవ వేదిక నుంచి ముఖ్యమంత్రి గారు విజ్ఞప్తి చేశారు. నిజాం నియంతృత్వ పాలనపై సాయుధ పోరాటంతో సామాన్యుడు సాధించుకున్న విజయానికి గుర్తుగా సెప్టెంబర్ 17 న నిర్వహిస్తున్న ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. "నిజాం నిరంకుశ పాలనపై జరిగిన పోరాటంలో 1948, సెప్టెంబర్ 17 రోజున ప్రజలు విజయం సాధించి, స్వేచ్ఛా పతాకను ఎగుర వేసిన రోజు. అందుకే ఇది ప్రజా పాలన దినోత్సవం. రాష్ట్ర ప్రజలందరికీ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు. అణచివేత, పెత్తందారీతనం, నియంతృత్వం, బానిసత్వం సంకెళ్లను బద్ధలు కొట్టి స్వేచ్ఛకు ఊపిరి పోయడానికి ఊపిరి వదిలిన వందలాది మంది అమరులకు మిగితా 2వ పేజీలో

## దేశానికి దిక్సూచిలా తెలంగాణ విద్యా విధానం ..

- భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడలు మేళవింపుతో ఉండాలి...
- విజన్ డాక్యుమెంట్ 2047లో విద్యా విధానానికి ప్రత్యేక అధ్యాయం..
- విద్యా రంగం సమూల ప్రక్షాళనే మా ధ్యేయం
- తెలంగాణ విద్యా విధానంపై సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

వివరాలు 2వ పేజీలో




## నిజాం మెడలు వంచిన సర్దార్ పటేల్

- దేశ చరిత్రలో ఆపరేషన్ పోలో అతి ప్రధాన ఘట్టం
- భారత్ స్వయం సమృద్ధిని సాధిస్తోంది
- ఆపరేషన్ సింధూర్‌తో పాక్‌కు బుద్ధి చెప్పాం
- తెలంగాణ విమోచన దినోత్సవంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నిజాం పాలనలో రజాకార్లు అనేక దారుణాలు చేశారని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. నిజాం పాలనలో రజాకార్లు అనేక దారుణాలు చేశారు. వారి ఆగడాలు తట్టుకోలేక ప్రజలు తిరగబడ్డారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సమర్థత వల్ల హైదరాబాద్ సంస్థానం భారత్‌లో కలిసింది. ఆపరేషన్ పోలో దేశ చరిత్రలో గొప్ప ఘట్టం. పటేల్ ముందు నిజాం తన ఓటమిని ఒప్పుకొన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధర్మ మార్గంలోనే నడుస్తాం. జాతీయ సమగ్రతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. పటేల్ కలలుగన్న దేశాన్ని నిర్మించేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటు-న్నారు. ఆర్టికల్ 370ని తొలగించి జమ్మూకశ్మీర్‌ను అభివృద్ధి చేస్తున్నాం. మనలో ఎన్ని విభేదాలున్నా దేశం విషయంలో అందరిదీ ఒకటే మాట. దేశ రక్షణ, భద్రత విషయంలో ప్రజలమంతా ఏకతాటిపైకి వస్తాం. ఇవాళ భారత్ అంటే సాదాసీదా దేశం కాదు. ప్రపంచాన్ని శాసించే స్థాయికి చేరుకుంటున్నాం అని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు సత్తా చాటారు. ఉగ్రవాది మసూద్ అజార్ కుటుంబ సభ్యులను హతమార్చాం. పహల్గాంలో మతం పేరు అడిగి మరీ చంపిన వారికి బుద్ధి చెప్పాం. ఆపరేషన్ సిందూర్‌లో భారత శక్తిసామర్థ్యాలు, సైనిక సత్తాను ప్రపంచం చూసింది. ఉగ్రవాదుల స్థావరాల్లోకి వెళ్లి మరీ వారిని హతమార్చాం. ఆపరేషన్ సింధూర్ ముగియలేదు. ఇప్పుడు చిన్న పాజ్ మాత్రమే. ఆపరేషన్ సింధూర్ కొనసాగుతుందని రాజ్‌నాథ్ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి రాజ్ నాథ్ సింగ్ నివాళులర్పించారు. పటేల్ కలలు కన్న దేశాన్ని నిర్మించేందుకు భారత్ ప్రధాని మోడీ కృషి చేస్తున్నారని, ఆర్టికల్ 370 తొలగించి జమ్ముకశ్మీర్ ను అభివృద్ధి చేస్తున్నామని తెలియజేశారు. మనలో ఎన్ని భేదాలున్నా దేశం విషయంలో అందరిదీ ఒకటే మాటని, దేశ రక్షణ, భద్రత విషయంలో ప్రజలంతా ఒక్కతాటికిపైకి వస్తామని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ తో భారత్ శక్తిసామర్థ్యాలు, సైనిక సత్తాను ప్రపంచం చూసిందని ప్రశంసించారు. ఉగ్రవాదుల స్థావరాల్లోకి వెళ్లి మరీ వారిని హతమార్చామని గర్వాన్ని వ్యక్తం చేశారు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నామని తెలుసుకోవాలని, ఇవాళ భారత్ అంటే సాదాసీదా దేశం కాదని, ప్రపంచాన్ని శాసించే స్థాయికి చేరుకుంటున్నాం అని రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు పల్లెలపై పడి దోచుకున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గ్రామాలపై పడి హత్యలు, అత్యాచారాలు చేశారన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో ముక్తి దివస్ చేసుకుంటే.. ఇక్కడెందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. పేర్లు మార్చి కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పార్టీలు వేడుకలు మిగితా 2వ పేజీలో

## 140 కోట్ల మందికి ప్రయోజనం కలిగేలా జీఎస్టీ




- జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతికి ఊరట
- ముఖ్యంగా వ్యవసాయరంగంపై భారీ ఓదార్పు
- ఉప్పులు, పప్పులు,సబ్బులవంటి నిత్యావసరాల ధరలు తగ్గుదల
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశంలోని 140 కోట్ల మందికి వర్తించే విధంగా జీఎస్టీపై పెద్ద నిర్ణయం తీసుకున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు ఈనెల 22 నుంచి అమల్లోకి వస్తాయని చెప్పారు. విశాఖపట్నంలోని మధురవాడలో జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించిన సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడారు. ప్రధానంగా వ్యవసాయరంగానికి ఎంతో మేలు చేకూర నుందని అన్నారు. రైతులకు మేలు చేసే విషయంలో నష్టమైనా ఫర్వాలేదని ప్రధాని మోడీ పట్టుబట్టారని అన్నారు. ఇప్పటికే అనేక రంగాల్లో జీఎస్టీ ప్రయోజనాలు చేకూరాయి. నాలుగు శ్లాబ్‌ల నుంచి రెండు శ్లాబ్‌లకు తగ్గించాం. 12 శాతంలో ఉండే వస్తువులు దాదాపు 99 శాతం 5 శాతం శ్లాబ్ పరిధిలోకి తీసుకొచ్చాం. 28 శాతం శ్లాబ్‌లో ఉండే సిమెంట్ సహా 90 శాతం వస్తువులు 18 శాతం శ్లాబ్ పరిధిలోకి తెచ్చాం. 2017కు ముందు 17 రకాల పన్నులు ఉండేవి.. వాటిపై 8 సెస్సులు కూడా ఉండేవి. ఉదాహరణకు 2017కు ముందు సబ్బు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉండేది. అన్నింటినీ కలిపి దేశవ్యాప్తంగా ఒకే పన్ను.. నాలుగు శ్లాబ్‌ల రూపంలో తీసుకొచ్చిందే జీఎస్టీ అని అన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ద్వారా రూ.7.19లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.22.08 లక్షల కోట్ల ఆదాయం లభించింది. ప్రజలపై భారం తగ్గించేందుకే జీఎస్టీ తీసుకొచ్చాం అన్నారు.

## పటేల్ చొరవతో హైదరాబాద్‌కు విముక్తి




- పాక్ అణుబెదరింపులకు లొంగేది లేదు
- ఆపరేషన్ సిందూర్‌తో మన సత్తా చాటాం
- మధ్యప్రదేశ్ పర్యటనలో ప్రధాని మోడీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానంలో అనేక దారుణాలు జరిగాయని ప్రధాని నరేంద్ర మోదీ గుర్తుచేశారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ రోజు సెప్టెంబర్ 17. ఇది మరో చరిత్రాత్మకమైన రోజు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో ధైర్య సాహసాలు చూపించి హైదరాబాద్‌ను దేశంలో విలీనం చేశారు. దీంతో నిజాం అకృత్యాల నుంచి సంస్థానానికి విముక్తి లభించింది. దానికి గుర్తుగా హైదరాబాద్ విమోచన దినం నిర్వహిస్తున్నాం అని మోదీ అన్నారు. దేశ ఐక్యత కోసం మన సైనికులు అనేక త్యాగాలు చేశారని కొనియాడారు. అణు ముప్పులకు నవ భారతం భయపడదని మోదీ అన్నారు. ఇది నవభారతం. ఎవరికీ భయపడదు. శత్రువుల భూభాగంలోకి వెళ్లి వారిని మన బలగాలు మట్టుపెట్టాయి. అణుబెదిరింపులకు తలొగ్గదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ అణు బెదిరింపులపై మరోసారి స్ట్రాంగ్

వార్నింగ్ ఇచ్చారు. పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్ తో భారత్ గట్టి బదులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబంలోని పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు కథనాలు వచ్చాయి. తాజాగా ఈ విషయాన్ని జైషే కమాండర్ మసూద్ ఇలియాస్ కశ్మీరీ అంగీకరించిన సంగతి తెలిసిందే. భారత్ ఆర్మీ తమ రహస్య స్థావరాల్లోకి ప్రవేశించి ఎలా దాడులు చేసిందనే విషయాలను వెల్లడించాడు. పాకిస్థాన్ బుద్ధిని వారు బయటపెట్టారంటూ దీనిని ఉద్దేశించి మోదీ వ్యాఖ్యలు చేశారు. పుట్టిన రోజున మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తోన్న ప్రధాని మోదీ.. స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్, రాష్ట్రీయ పోషణ్ మాహ్ కార్యక్రమాలను ప్రారంభించారు. మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మెరుగైన వైద్య సేవల ద్వారా కుటుంబాలను, దేశాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఈ పథకాలను తీసుకొచ్చారు.



## హైదరాబాద్‌లో వర్షం

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు, పలు కాలనీలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నగర వ్యాప్తంగా బుధవారం రాత్రి వర్షం దంచి కొట్టింది. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారులు మొదలుకొని అంతర్గత రహదారులు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లు, కాలనీల్లోకి నీరు రావడంతో జనం ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల అపార్ట్మెంట్లలోని సెల్లార్లు నీటితో నిండిపోయాయి. శబ్దాలతో కూడిన వర్షంతో లోతట్టు ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. రాత్రి 9 గంటల నుంచి గంటన్నరకు పైగానే నగరంలోని భారీ వర్షం పడింది. ఫ్లై ఓవర్లపైన కూడా మోకాళ్లలోతు నీరు నిలిచింది. డీఆర్ఎఫ్ మాన్సున్ టీమ్స్ రంగంలోకి దిగాయి. వర్షపునీరు చేరిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు.

## సిరిసిల్లలో ప్రొటోకాల్ వివాదం

- ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ఆలస్యంగా వచ్చిన కలెక్టర్

వివరాలు 4వ పేజీలో

## సినీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



- సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలుగు సినీ పరిశ్రమలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం సీఎం నివాసంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు ఆధ్వర్యంలో తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రతినిధులు సీఎం రేవంత్‌ను కలిసి పలు అంశాలను ప్రస్తావించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, సినిమా కార్మికులను విస్మరించవద్దని నిర్మాతలకు సూచించినట్లు వెల్లడించారు. సినీ కార్మికుల నైపుణ్యాల పెంపు కోసం సిల్క్ యూనివర్సిటీలో శిక్షణా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. చిన్న సినిమాల నిర్మాతలకు ప్రోత్సాహం ఇవ్వాలని, పరిశ్రమలో పని వాతావరణాన్ని చెడగొట్టకూడదని సూచించారు. సమ్మెలు రెండు వైపులా నష్టమేనని, సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్మాతలతో చర్చలు జరుపుతుందని స్పష్టం చేశారు. సినీ కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్ అందించే ప్రయత్నం చేస్తామని, కళాకారులకు గద్దర్ అవార్డులు ఇవ్వడం ప్రారంభించినట్లు గుర్తు చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి కాసుమిల్లి అమ్మిరాజు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణలో నియంతలా వ్యవహరిస్తున్న సీఎం

- ఎల్ అండ్ టీ వెనక్కు వెళ్లడానికి ముఖ్యమంత్రి బెదిరింపులే కారణమని
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి చోటు లేకుండా నిరంకుశ పాలన కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. గ్రూప్-1 అభ్యర్థులు, విద్యార్థులు కనీసం రౌండ్‌టేబుల్ సమావేశం పెట్టుకునే పరిస్థితి కూడా లేని దుస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు.బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, "రేవంత్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక పని అయినా చెప్పండి. ఆశావర్కర్లు, రేషన్ డీలర్ల ఆందోళనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. స్కూళ్లు, కాలేజీలు మూతపడ్డాయి. ఆరోగ్యశ్రీ రద్దు కారణంగా ఆసుపత్రులు స్తంభించాయి" అని విమర్శించారు.

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ నుంచి ఎల్ అండ్ టీ వెనక్కు వెళ్లడానికి ముఖ్యమంత్రి బెదిరింపులే కారణమని కేటీఆర్ ఆరోపించారు. "కంపెనీల అధికారులను జైలులో పెడతానని బెదిరించడం వల్లే పెట్టుబడిదారులు రాష్ట్రం నుంచి పారిపోతున్నారు" అని దుయ్యబట్టారు. గతంలో వివాదాస్పదంగా నిలిచిన సంస్థల ఆస్తుల అమ్మకాలలోనూ ముడుపులు ఉన్నాయని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో బంధుప్రీతి లేదన్న రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన కేటీఆర్, "సుజన్ రెడ్డి, అమిత్ రెడ్డిలకు వందల కోట్ల కాంట్రాక్టులు ఎలా వచ్చాయి? బంధుప్రీతి లేని ప్రభుత్వం అయితే ఇవి ఎక్కడి నుంచి వచ్చాయి?" అని ప్రశ్నించారు. సిరిసిల్ల నేతన్నలపై ప్రభుత్వం ప్రతీకారంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల డ్రగ్స్ పట్టుబడినా ముఖ్యమంత్రి స్పందించలేదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

"ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను కాంగ్రెస్ తమ భూముల ప్రయోజనం కోసం మార్చేసింది. ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేను రద్దు చేసి ఐటీ విస్తరణకు ఆటంకం కలిగించారు" అని కేటీఆర్ ఆరోపించారు. గత ఎన్నికల్లో గెలిచిన ఎనిమిది మంది ఎంపీలను బీజేపీకి మేకలు, గొర్రెల మాదిరిగా అమ్మేశారని కేటీఆర్ ఆరోపించారు. "రేవంత్ రెడ్డి కాంగ్రెస్ వ్యక్తి కాదు, బీజేపీ మనిషే" అని అన్నారు. గ్రూప్-1 పోస్టులు కోట్ల రూపాయలకే అమ్మేశారని అభ్యర్థులే చెబుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. హైకోర్టు కూడా అవకతవకలను గుర్తించిందని ఆయన గుర్తుచేశారు.

ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని, స్థానిక ఎన్నికలు నిర్వహించే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. "యువతతో పెట్టుకుంటే పతనం తప్పదు" అని హెచ్చరించిన ఆయన, రేవంత్ రెడ్డి ఇప్పటిదాకా ఒక్క గొప్ప కార్యక్రమాన్ని కూడా చేపట్టలేదని సవాల్ విసిరారు.



## నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఏడుగురు అక్కడిక్కడే మృతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సంగం మండలం పెరమన వద్ద జాతీయ రహదారిపై కారును టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నారి సహా ఏడుగురు మృతిచెందారు. రాంగ్ రూట్‌లో టిప్పర్ వేగంగా వచ్చి కారును ఢీకొట్టి కొద్దిదూరం లాక్కెళ్లింది. టిప్పర్ కిందకు కారు వెళ్లడంతో అందులోని మృతదేహాలు నుజ్జునుజ్జయ్యాయి. కారు నెల్లూరు నుంచి కడప వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. నెల్లూరు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. సంగం మండలం పెరమన వద్ద ముంబై జాతీయ రహదారిపై ఈఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన ఇసుక టిప్పర్ రాంగ్ రూట్‌లో వెళ్లి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. కారును ఢీకొట్టి ఆపై కొంత దూరం వరకు టిప్పర్ లాక్కెళ్లింది. దీంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. మృతుల్లో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు, ఒక పాప ఉన్నట్లు-తెలుస్తోంది.సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కారు తాళ్లూరు రాధా పేరుపై రిజిస్ట్రేషన్ అయినట్లు- పోలీసులు గుర్తించారు. మృతులు నెల్లూరు జిల్లా కేంద్రంలోని ముత్తుకూరు గేటు- మిగితా 2వ పేజీలో



## సిరిసిల్లలో ప్రొటోకాల్ వివాదం

- **ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ఆలస్యంగా వచ్చిన కలెక్టర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. జిల్లాలో నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ఆయన వ్యవహరించిన తీరు ప్రొటోకాల్ ఉల్లంఘనగా మారడం చర్చనీయాంశమైంది. నిర్ణీత సమయానికి కలెక్టర్ హాజరు కాకపోవడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించడం గమనార్హం. సిరిసిల్లలో ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా వందనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. అయితే, జిల్లా ప్రథమ పౌరుడైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాత్రం సమయానికి వేడుకలకు చేరుకోలేదు. ఆయన కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు కొంతసేపు వేచి చూశారు.సమయం మించిపోతుండటంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలెక్టర్ లేకుండానే జాతీయ జెండాను ఎగరవేసి వందనం సమర్పించారు. అనంతరం జాతీయ గీతం ఆలపిస్తుండగా చివరి దశలో కలెక్టర్ వేదికపైకి చేరుకున్నారు. ప్రొటోకాల్ ప్రకారం స్వాగతం పలకక పోవడం, జెండావిష్కరణకు ఆలస్యంగా రావడం పట్ల ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాతా వేదికపైకి వచ్చిన కలెక్టర్‌కు ఆది శ్రీను తన చేతి గడియారం చూపిస్తూ దిస్ ఈజ్ నాట్ కరెక్ట్ వే అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం.

## నిజాం మెడలు వంచిన సర్దార్ పటేల్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నాయని తెలిపారు. మజ్లిస్‌కు భయపడి చరిత్రను కనుమరుగు చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ ఆదేశాలతో విమోచన దినోత్సవాన్ని కేంద్రం అధికారికంగా నిర్వహిస్తోందని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వారిని కేంద్రం గుర్తించి గౌరవిస్తుందని చెప్పారు. నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు ఎంతో మంది ప్రాణాలు అర్పించారన్నారు. ఆపరేషన్ పోలోతో సర్దార్ వల్లభాయ్ పటేల్ హైదరాబాద్‌కు విముక్తి కల్పించారని వివరించారు. నిజాం నిరంకుశ పాలన తలచుకుంటే ప్రజల రక్తం మరుగుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఉర్దూను ప్రజలపై రుద్దేందుకు నిజాం ప్రయత్నించారన్నారు. బలవంతపు మతమార్పిడులు చేశారని.. మతం మారని వారికి ఎక్కువ పన్నులు వేసి ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. ఓటు- బ్యాంకు రాజకీయాలతో రాష్ట్ర పాలకులు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటు-లో రాజ్‌నాథ్ సింగ్ ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు.అంతకుముందు అసెంబ్లీ ముందున్న పటేల్ విగ్రహానికి కేంద్రమంత్రులు నివాళి అర్పించారు.

## నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

సమీపంలో గుర్రంవారివీధికి చెందినవారిగా తెలుస్తోంది. మృతుల్లో శేషం శేర(42), శేషం బాలవెంగ(40), తాళ్లూరి రాధా(38), తాళ్లూరి శ్రీనివాసులు (42), తెల్లగుండ్ల లక్ష్మి(40), తెల్లగుండ్ల శ్రీనివాసులు ఉన్నారు. కాగా.. డ్రైవర్ పేరు తెలియాల్సి ఉంది. ఆత్మకూరులో ఒకరిని పరామర్శించేందుకు ప్రభుత్వ వైద్యశాల వద్దకు వెళుతూ ఉండగా ఈ ప్రమాదం జరిగినట్టు- సమాచారం. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.రోడ్డు ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించాలంటూ మంత్రి ఆదేశాలు జారీ చేశారు. భద్రత చర్యలు చేపట్టాలని రవాణా అధికారులకు మంత్రి సూచనలు చేశారు. నిర్లక్ష్యంగా ఉంటే సహించమని హెచ్చరిస్తూ.. సహాయక చర్యలు తీసుకోవాలని ఫోన్లో అధికారులకు మంత్రి రాంప్రసాద్ ఆదేశించారు. జాతీయ రహదారిపై టిప్పర్ లారీ ఢీకొని పలువురు మరణించిన వార్త తీవ్రంగా కలచివేసిందని మంత్రి మండిపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్ర రోడ్లు- భవనాలు, పెట్టు-బడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. టిప్పర్ - కారు ఢీకొని పలువురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. మృతుల కుటు-ంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటు-ందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# దేశానికి దిక్సూచిలా తెలంగాణ విద్యా విధానం

- **ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి..**

**బలగం టీవీ, హైదరాబాద్**

క్షేత్ర స్థాయి పరిస్థితులు, అధ్యయనం, భవిష్యత్ అవసరాలకు తగినట్లు రూపొందించే తెలంగాణ విద్యా విధానం భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారి దగ్గర జ్ఞానం లేదని... జ్ఞానం ఉన్న చోట భాష లేదని.. రెండు ఉన్న చోట నైపుణ్యాలు లేవని.. కానీ ఈ మూడింటి కలబోతగా విద్య ఉండా లని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ విద్యా విధానం నివేదిక రూపకల్పనపై తెలంగాణ సెక్రటేరియట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేయాలని తాము నిర్ణయిం చుకున్నట్లు సీఎం తెలిపారు. గతంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు భూముల పంపకం... నిధుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టేవని... ఇప్పుడు పంపకానికి భూములు, తగినన్ని నిధులు లేవన్నారు. ఇప్పుడు పేదరిక నిర్మూలనకు విద్య తప్ప మరో ఆయుధం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యా రంగం ప్రాధాన్యతను గుర్తించినందునే ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశంలో విశ్వ విద్యాలయాలు, ఐఐటీలు వంటి ఉన్నత విద్యా సంస్థలను స్థాపించారని గుర్తు చేశారు.

మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా ఉన్న కాలంలో ఉద్యోగావకాశాలకు అనేక పరిమితులు ఉన్నాయని సీఎం అన్నారు. సరళీకృత ఆర్థిక వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగినప్పటికీ విద్యాప్రమాణాలు ఆస్థాయిలో పెరగకపోవ డంతో వాటిని అందిపుచ్చుకోవడంలో మనం విఫలమవుతున్నామని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. కాలానుగుణంగా ఇంజినీరింగ్ కళాశాలలు వచ్చినందునే పెద్ద సంఖ్యలో సాఫ్ట్ వేర్ రంగంలో మన యువత రాణిస్తున్నారని సీఎం తెలిపారు. అయినప్పటికీ మన రాష్ట్రం నుంచి ఏటా బయటకు వస్తున్న లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో పది శాతం మందికి కూడా ఉద్యోగాలు దక్కడం లేదన్నారు. తగినంత నైపుణ్యం లేకపోవడమే అందుకు కారణమన్నారు. ఆ రంగంలో నైపుణ్యాలు పెంచడంతో పాటు ఇంకా పలు రంగాల్లో అవకాశాలు విస్తృతమైనందున ఆ అవకాశాలు అందిపుచ్చుకునేలా విద్యా రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు.

విద్యా రంగానికి భారీఎత్తున నిధులు కేటాయిస్తున్నా ఏటికేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రైవేటు పాఠశాలలు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీతో ప్రారంభిస్తుంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ప్రారంభమవుతున్నాయన్నారు. నర్సరీకి ప్రైవేటు పాఠశాలలో చేరిన వారు తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు చూడడం లేదన్నారు. విద్యార్థుల రాకపోకలు, తగిన శ్రద్ధ చూపుతారనే కారణంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారని సీఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు ఆ రకమైన ధీమా కల్పించగల్గితే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే



చేర్చుతారని.. తెలంగాణ విద్యా విధానం రూపకల్పనలో ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని సీఎం సూచించారు.

విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉపాధ్యాయులు ఉండాలనే ఉద్దేశంతో తాము అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఉపాధ్యాయులు బోధనపై దృష్టి పెట్టేలా వారికి ప్రమోషన్లు, బదిలీలు చేశామన్నారు. యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకం చేపట్టామని సీఎం తెలిపారు. ఉస్మానియా, కాకతీయ విశ్వ విద్యాలయాలు గతంలో సైద్ధాంతిక భావజాలలకు నిలయంగా నిలిచి ప్రజా సమస్యలపై ఆందోళనలు, ఉద్యమాలు చేపట్టేవని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వ విద్యాలయాల స్థాయి వరకు విద్యా ప్రమాణాలు పడిపోవడం.. నైపుణ్యాల లేమితో ఉద్యోగాలు లభించకపోవడంతో విద్యార్థులు డ్రగ్స్ బారినపడి జీవితాలను కోల్పోతున్నారని సీఎం అన్నారు. మన చదువులు భాష, జ్ఞానం, నైపు ణ్యాలు, క్రీడల మేళవింపుతో ఉండాలని సీఎం అన్నారు. దేశంలో ఐటీఐలు ప్రారంభించి నప్పుడు ఉన్న డీజిల్ ఇంజిన్ మెకానిక్, ఫిట్టర్ వంటి సంప్రదాయ కోర్సులే నేటికీ ఐటీఐల్లో ఉన్నాయని సీఎం తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలు అందించే కోర్సులను అందించేందుకు ఐటీఐల్లో కోర్సులను మార్చామని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

ఇప్పటి వరకు విద్యా రంగంపై తాము చేసిన కృషితోనే తాము సంతృప్తి చెందడం లేదని.. ప్రాథమిక దశ నుంచి యూనివర్సిటీల వరకు సమూల ప్రక్షాళన చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రానున్న 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని సీఎం అన్నారు. డిసెంబరు 9వ తేదీన ఆవిష్కరించనున్న తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047లో తెలంగాణ విద్యా విధానానికి చోటు కల్పిస్తామని సీఎం వెల్లడించారు. ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక, నైపుణ్య విద్యలుగా విభజించుకొని ఇందులో ఉన్న విద్యావేత్తలు తమ అభిరుచులకు అనుగుణంగా సబ్ కమిటీలుగా ఏర్పడి అత్యుత్తమ డాక్యుమెంట్ రూపొందించాలని సీఎం కోరారు.

విద్యా వ్యవస్థ వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం కాకుండా నిరుపేదలకు లబ్ధికలిగేలా ఉండాలని తాము ఆకాంక్షిస్తున్నామని సీఎం తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాల పేరిట విద్యార్థులను చిన్నతనం నుంచే వేరు చేస్తున్నామని... దానిని రూపుమాపి అంతా ఒకటే అనే భావన కలిగించేలా విద్యాలయాల్లో అందరికీ సమాన అవకాశాలు ఉండాలని సీఎం అన్నారు. మీరు రూపొందించే తెలంగాణ విద్యా విధానం దేశానికి దిక్సూచిలా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆశించిన స్థాయిలో తెలంగాణ విద్యా విధానం అమలయ్యేందుకు వివిధ ఫౌండేషన్లు, ఎన్జీవోల సహకారం తీసుకోవాలని సీఎం సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమగ్రంగా వినియోగించుకునేలా విద్యా విధానం ఉండాలన్నారు.

విద్యా విధానంపై ఎంత వ్యయానికైనా తాము వెనుకాడమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక విద్యా కార్పొరేషన్ ఏర్పాటు చేసి మౌలిక వసతులు, ప్రమాణాల మెరుగుకు ఖర్చు చేయాలని నిర్ణయించామని తెలిపారు. విద్యపై చేసే వ్యయాన్ని వ్యయంగా కాక పెట్టుబడిగా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించామన్నారు. విద్యాభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి నుంచి తొలగించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కోరామని సీఎం తెలిపారు. తెలంగాణ విద్యా విధానంలో సిలబస్ రూపకల్పన, వనరుల సమీకరణ, విధానం అమలుపై స్పష్టత అవసరమని సీఎం పేర్కొన్నారు.

తెలంగాణ విద్యా విధానం ఛైర్మన్ కేశవరావు మాట్లాడుతూ విద్యా కమిషన్, ఇతర భాగస్వాములతో తాము విస్తృత సంప్రదింపులు చేశామన్నారు. గణాంకాల కన్నా నాణ్యత ప్రధానమని, విద్యార్థి కేంద్రంగా బోధన ఉండాలనేది తమ అభిప్రాయమన్నారు...ఏఐ వంటివి ఎన్ని వచ్చినా అవి గురువుకు ప్రత్యామ్నాయం కావన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.వి.సుబ్బారావు దేశ యువతలో మూడో వంతు NEET గాఉన్నారని...దాని అర్థం నాట్ ఇన్ ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ అని ఓ సర్వే తేల్చిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల పెంపునకు చేసిన కృషి అభినందనీయమన్నారు. లిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తన సేవలను విద్యా రంగానికి వినియోగించుకోవాలని... విద్యా వలంటీర్ గా వినియోగించుకోవాలనిలి కోరారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి తాము స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నామని... ఒక్క ఏడాదిలో 180 పేటెంట్లు పొందామని సీఎం తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ విద్యా విధానం కొలువుల సాధనకే కాకుండా అత్యుత్తమ మానవునిగా తీర్చిదిద్దేదిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎమ్మెల్సీలు ఏ.వి.ఎన్.రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, విద్యావేత్తలు మోహన్ గురుస్వామి, ప్రొఫెసర్ సుబ్బారావు, సీఐఐ శేఖర్ రెడ్డి, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, అక్షరవనం మాధవరెడ్డి, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, ప్రొపెసర్ గంగాధర్, విశ్రాంత ఐఏఎస్‌లు మిని మాథ్యూ శ్రీమతి రంజీవ్ ఆచార్య, ప్రొఫెసర్ శాంతా సిన్హా తదితరులు మాట్లాడారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, అధికారులు జయేశ్ రంజన్, శ్రీదేవసేన, కృష్ణ ఆదిత్య, నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి అందరం భాగస్వాములం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను.సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయి. అదే విధంగా డిసెంబర్ 7, 2023 స్వరాష్ట్ర ప్రజాస్వామ్య ప్రస్థానంలో మరో మైలు రాయి. 77 ఏళ్ల తెలంగాణ ప్రస్థానాన్ని, పోరాట చరిత్రను, ఇక్కడ ఉద్భవించిన ఉద్యమాల సరళిని సంపూర్ణంగా ఆకళింపు చేసుకుని, ప్రజల ఆకాం క్షలను అర్థం చేసుకుని మేం ఈ రోజు పరిపాలన చేస్తున్నాం. అహంకారపు ఆలోచనలు, బంధు ప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి మా పాలనలో తావు లేదు. కష్టమైనా, నష్టమైనా ప్రజలతో పంచుకుంటున్నాం. ప్రజల ఆకాంక్షలు, వారి ఆలోచ ననే ప్రమాణికంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. తీసుకున్న నిర్ణయాలలో మంచి చెడులను విశ్లేషించే అవకాశం ఇస్తున్నాం. తప్పులుంటే దిద్దుకుంటున్నాం. మంచి చేయడమే బాధ్యతగా భావిస్తున్నాం. అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడాలన్న తపనతో పని చేస్తున్నాం.విద్యనే మన విజయానికి వజ్రాయుధం అని మేం నమ్ముతున్నాం. గొప్ప విజన్‌తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల ఆలోచన చేశాం. భవిష్యత్‌లో తెలంగాణ విద్య వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు ఈ స్కూళ్లు కేంద్రాలుగా మారబోతున్నాయి. విద్యపై మేం చేస్తున్న వ్యయం ఖర్చు కాదు. భవిష్యత్ తెలంగాణకు పెట్టుబడిగా మేం భావిస్తున్నాం. రాష్ట్ర విద్యా మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి" నినాదంతో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మేం చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. మహిళలు నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్, మహిళా మార్ట్ లు అందుకు నిదర్శనం. హరిత విప్లవం నుండి ఉచిత విద్యుత్ వరకు, రుణమాఫీ నుండి రైతు భరోసా వరకు రైతుల కోసం మనం రూపొందించిన సంక్షేమ పథకాలు ఎప్పటికప్పుడు కొత్త చరిత్రను సృష్టిస్తు న్నాయి. రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణాలు మాఫీ చేసి దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా రైతులను ఆదుకున్నాం. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేసి పెట్టుబడికి భరోసా ఇచ్చాం. ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా రైతుల సంక్షేమం విషయంలో రాజీ పడలేదు. కేవలం ఏడాది కాలంలో లక్షా నాలుగు వేల కోట్ల రూపాయలు రైతుల ప్రయోజనాలపై ఖర్చు చేసిన ప్రభుత్వం ఈ దేశంలో మరొకటి లేదు.ప్రజా ప్రభుత్వం తొలి 20 నెలల్లోనే ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా సుమారు 60 వేల ఉద్యోగాల భర్తీ చేశాం. సివిల్ సర్వీసెస్ అభ్యర్థులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో రాజీవ్ గాంధీ సివిల్స్ ఆభయ హస్తం ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాం. భూ పోరాటాల చరిత్రనే తెలంగాణ చరిత్ర. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి కారణంగా తెలంగాణ రెవెన్యూ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తమైంది. అందుకే భూ భారతి చట్టం తెచ్చాం. క్షేత్ర స్థాయిలో ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ఇటీవలే 5 వేల మంది గ్రామ పాలనా అధికారులను నియమించాం.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు గ్రామాల్లో పేదల ఆత్మగౌరవ ప్రతీకలు. కొత్తగూడెం జిల్లా అశ్వారావు పేట నియోజకవర్గంలోని బెండలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్నప్పుడు ఆ పేదల కళ్లలో చూసిన ఆనందం నాకు ఎనలేని తృప్తినిచ్చింది అన్నారు.



## ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి..

- **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం కందికట్క్యూర్ గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో నీరు నిలిచి ఉండడాన్ని కలెక్టర్ గమనించారు. ఈ కాలనీలో సీ సీ రోడ్డు, మురుగు కాలువలు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో కావలసిన అన్ని వసతులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటన లో ఎంపీడీఓ శశికళ, శ్రీనివాస్, నాయబ్ తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల గ్రంథాలయంలో ఘనంగా ప్రజా పాలన, తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన మరియు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్ర గ్రంథాలయం సిరిసిల్ల నందు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు బి. శంకరయ్య, సిబ్బంది మరియు పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## సెప్టెంబర్ 23,24 తేదిల్లో జరిగే కేవీపీఎస్ జిల్లా ద్వితీయ మహాసభలు జయప్రదం చేయండి..

- **జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల పట్టణ కేంద్రంలో మహాసభల కరపత్రలు ఆవిష్కరించిన కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ద్వితీయ మహాసభలు సెప్టెంబర్ 23, 24 తేదీల్లో సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమ భవన్‌లో జరగనున్నాయి. ఈ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎరవెల్లి నాగరాజు మాట్లాడుతూ, గత 28 ఏళ్లుగా కెవిపిఎస్ సామాజిక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. దళితుల హక్కుల కోసం అనేక విజయాలు సాధించిందని పేర్కొన్నారు.

కెవిపిఎస్ సాధించిన విజయాల్లో కొన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు 2003, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013, దళితుల శవాలను పూడ్చుకోవడానికి 2 ఎకరాల స్మశాన స్థలం కేటాయింపు జీవో నెం. 1235, దళితులకు 101 యూనిట్ల ఉచిత విద్యుత్ జీవో నెం. 341, కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు రూ. 2.50 లక్షల ఆర్థిక సహాయం జీవో నెం. 12 లను కెవిపిఎస్ 28 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో పోరాడి సాధించింది. మన జిల్లాలో కులవివక్ష అంటరానితనం దళితులపై దాడులు వంటి సమస్యలపై కేవీపీఎస్ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నది.సామాజిక న్యాయం కోసం అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం కేవీపీఎస్ సైకిల్ యాత్రలు చర్చాగోష్టులు సదస్సులు సెమినార్లు ధర్నాలు హాస్టల్ అధ్యయన యాత్రలు వంటి ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలు అనేకం నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరిచింది. జిల్లాలో కందికట్క్యూర్,రామోజీపేట, అల్మాస్పూర్ దళితులపై దాడి జరిగినా ఘటనలో బాధితులకు బాసటగా కెవిపిఎస్ నిలిచింది మహనీయుల జయంతులు వర్ధంతిలు నిర్వహిస్తూ వారి ఆశయాల అనుగుణంగా పనిచేస్తుందని అన్నారు, కావున ఈ జిల్లా మహాసభల నిర్వహణ భవిష్యత్ సామాజిక ఉద్యమాల కోసం ఈ మహాసభ చర్చించబోతుందని అన్నారు. ఈ మహాసభలకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తిప్పారపు సురేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. ఈ సభలను విజయవంతం చేయాలని నాగరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూడుకాల గిరిబాబు, రాజు, వెంకటేష్, నరేందర్, మోహన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండా ఆవిష్కరించిన ఎస్పీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు, ఆర్.ఐ లు, ఎస్.ఐ లు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## విశ్వకర్మ జయంతి మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

విశ్వకర్మ జయంతిని పునస్కరించుకొని వేములవాడ పట్టణం భగవంతు రావు నగర్ లో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ విశ్వకర్మ జయంతి మహోత్సవంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలిపారు..అనంతరం స్పెషల్ డెవలెప్మెంట్ ఫండ్ నుండి మంజూరు అయిన 6 లక్షల ప్రొసీడింగ్ కాపీ ని సంఘ సభ్యులకు అందజేశారు.

## మహోన్నత పోరాటంపై మతోన్మాదులకు మాట్లాడే హక్కు లేదు..

- **సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో విషపురుగులైన కాషాయ ఉన్మాదులకు ఏమిటి సంబంధమని, మట్టి మనుషుల మహోన్నత పోరాట చరిత్ర గురించి మాట్లాడే నైతిక అర్హత మతోన్మాద బిజెపికి లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి టి స్కైలాబ్ బాబు విమర్శించారు.బుధవారం రోజున సీపీఎం నాయకులు, వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా సిరిసిల్ల ఆర్డీవో ఆఫీసు నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బద్దం ఎల్లారెడ్డి, అమృత్ లాల్ శుక్లా కర్రోళ్ల నర్సయ్య గడ్డం తిరుపతి రెడ్డి సింగిరెడ్డి భూపతి రెడ్డి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. 1946 సెప్టెంబర్ 11 నుండి 1951 సెప్టెంబర్ 17 వరకు జరిగిన వీరోచిత వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లో మచ్చుకైనా కనిపించని మతోన్మాదులు ఆ పోరాటానికి వారసులమంటూ సభలు పెట్టడం విడ్డూరంగా ఉందని అన్నారు. 1913లో హిందూ మహాసభ 1925లో ఆర్ఎస్ఎస్ 1951 లో జనసంఘ్ ఏర్పడితే ఆ పోరాటం జరిగిన కాలంలో మీరు ఎందుకు ఆ పోరాటంలో పాల్గొనలేదని ప్రశ్నించారు నైజాం తెలుగు మాట్లాడకూడదు అంటూ ఉర్దూ మాత్రమే ఉండాలని చెప్పిన్నట్లుగానే నేడు బిజెపి హిందీ మాత్రమే మాట్లాడాలి అని మాతృభాష మాట్లాడకూడదు అంటూ చెబుతుందన్నారు నైజాం నరేంద్ర మోడీ ప్రభుత్వానికి మధ్యల అవినాభావ సంబంధం ఉందన్నారు. విస్నూర్ రామచంద్రారెడ్డి ఎర్రబాడు దొరలు భూస్వాములు జాగిర్ధరులు నిజాం సైన్యంలో అత్యధికలు తెలంగాణ గడ్డ లోని మట్టి మనుషులను నానా చిత్ర హింసలు పెట్టారని దోపిడీ చేశారని చెప్పారు విసునూర్ రామచంద్రారెడ్డి ది ఏ మతమని ప్రశ్నించారు అది హిందూ ముస్లింల పోరాటం కాదని దోపిడీ చేసిన దోపిడీదారులు, దోపిడీ కి గురైన పేదలు కూడా హిందువులేనని చెప్పారు దోపిడి పీడనకు వ్యతిరేకంగా తిరుగుబాటు అని చెప్పారు.

ముస్లిం నైజాం రజాకారులకు వ్యతిరేకంగా పోరాడిన వారిలో ఈ మట్టి గడ్డమీద పుట్టిన మైనార్టీ లైన ముస్లింలు ప్రాణ త్యాగాలు చేశారని చెప్పారు ముగ్ధుమ్ మోహిఒనుద్దీన్ అలంకుంద్ మీరి కామ్రేడ్స్ అసోసియేషన్ స్థాపించారని షోయబుల్లాఖాన్ సీనియర్ జర్నలిస్టుగా ఇమ్రేజ్ అనే పత్రిక నడిపించి నైజాం నిరంకుశ చర్యలను ఎండగడుతూ కథనాలు రాశాడని నిలబెట్టి కాళు చేతులు నరికి కాచిగూడ రైల్వే స్టేషన్ లో చిత్రహింసలు పెట్టింది ముస్లిం రజాకారులు కాదాఅని ప్రశ్నించారు ఆ పోరాటంలో మొదటగా ప్రాణాలు ఇచ్చింది షేక్ బందగీ ముస్లిం కాదాఅని చెప్పారు ఆ ఉద్యమంలో అడుగడుగున ముస్లింలు ముస్లిం రాజుకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు మూడువేల గ్రామాలను విముక్తి చేసి గ్రామ రాజ్య కమిటీ ఏర్పాటు, చేసి 10లక్షల ఎకరాల భూములు పంచి 4000 మంది అమరులైన వీరోచిత పోరాట గాథ అని కొనియాడారు ఆర్ఎస్ఎస్ బిజెపి హైజాక్ చేస్తామంటే చరిత్ర క్షమించదని చెప్పారు నిజాం రాజైన మీరు ఉస్మాన్‌అలీ ఖాన్ కు రాజ్య ప్రముక్ ప్రకటించి కిరీటం పెట్టిందది నెహ్రూ పటేల్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు రాజాకార్ సైన్యాధిపతిగా ఉన్న ఖాసిం రజ్విని కమ్యూనిస్టుల పోరాటానికి భయపడి రహస్యంగా పాకిస్తాన్ కు పంపింది ఎవరో చెప్పాలన్నారు కమ్యూనిస్టుల పోరాట వారసత్వాన్ని ఈ తరానికి అందించకుండా దానిని మతంరంగు పులిమి యువతరాన్ని తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాట వాస్తవ చరిత్ర వారసులు ముమ్మాటికి కమ్యూనిస్టులేననిచెప్పారు. తెలంగాణ గడ్డలో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా భవిష్యత్ లో అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని నెహ్రూ పటేల్ కలిసి కమ్యూనిస్టులను అణిచివేయడానికి సైన్యాన్ని పంపారే కానీ నైజాంకు వ్యతిరేకంగా పటేల్ సైన్యాలు రాలేదని మల్లారెడ్డి చెప్పారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని విద్యార్థులు యువతరం క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని వాస్తవ చరిత్రను వంట పట్టించుకోని మతోన్మాదులకు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, కోడం రమణ, మల్లారపు అరుణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య, ఎరవెల్లి నాగరాజు, సూరం పద్మ, గురజాల శ్రీధర్, అన్నల్దాస్ గణేష్, మల్లారపు ప్రశాంత్ తదితరులున్నారు.

## మాల మహానాడు జిల్లా విస్తృత స్థాయి సమావేశం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా, పెద్దూర్ లోని ఓ ఫంక్షన్ హాలులో మాల మహానాడు జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏబిసిడి వర్గీకరణ వల్ల మాలలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పునరాలోచించి సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో న్యాయ పోరాటాలకు సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నీరటి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మంగ కిరణ్, ఉపాధ్యక్షులుగా మూల కిషోర్, వంకాయల మహేష్, ప్రధాన కార్యదర్శిగా గూడ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జిగా ఎడ్ల రాజకుమార్, వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జిగా బత్తుల కమలాకర్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో 12 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు ప్రతినిధులు పాల్గొన్నారు

# ప్రపంచ నెంబర్ 1 బ్యాటర్‌గా స్మృతి మంధాన




**బలగం టీవీ, హైదరాబాద్**

భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన మరోసారి ప్రపంచ నెంబర్ వన్ వన్డే బ్యాట్స్‌మన్‌గా నిలిచింది. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో ఆమె హాఫ్ సెంచరీతో ఆమె సత్తా చాటింది. మంగళవారం విడుదలైన ఐసీసీ వన్డే మహిళల బ్యాటర్స్ ర్యాంకింగ్స్‌లో ఆమె తిరిగి నంబర్ వన్ స్థానాన్ని సంపాదించుకుంది. ముల్లన్‌పూర్‌లో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో మంధాన 63 బంతుల్లో 58 పరుగులు చేసింది. కానీ ఆమె ఇన్నింగ్స్ తన జట్టును విజయపథంలో నడిపించడంలో విఫలమైంది. ఆస్ట్రేలియా సులభంగా లక్ష్యాన్ని సాధించి 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. సెప్టెంబర్ 30న ప్రారంభమయ్యే మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌నకు ముందు ప్రపంచంలోనే నంబర్ వన్ వన్డే బ్యాట్స్‌మన్‌గా నిలిచిన మంధాన ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. తొలి వన్డేలో మంధాన అర్ధ సెంచరీతో ఏడు రేటింగ్ పాయింట్లు సంపాదించింది. దీంతో ఆమె ఇంగ్లాండ్‌కు చెందిన నాట్ స్కైవర్-బ్రంట్ కంటే నాలుగు పాయింట్లు ముందుకు వచ్చింది. ఆమె రెండవ స్థానానికి పడిపోయింది. మంధానకు 735 రేటింగ్ పాయింట్లు ఉండగా, స్కైవర్-బ్రంట్‌కు 731 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. మంధాన తొలిసారిగా 2019లో ప్రపంచ నంబర్ వన్ వన్డే బ్యాట్స్‌మన్‌గా నిలిచింది. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో 64 పరుగులు చేసిన ఓపెనర్ ప్రతీకా రావల్ నాలుగు స్థానాలు ఎగబాకి 42వ స్థానానికి చేరుకోగా, టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ హర్లీన్ డియోల్ 54 పరుగులతో 43వ స్థానానికి చేరుకుంది. ఆస్ట్రేలియా తరపున, ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ బెత్ మూనీ 77 పరుగులతో అజేయంగా నిలిచి మూడు స్థానాలు ఎగబాకి ఐదవ స్థానానికి చేరుకోగా, అన్నాబెల్ సదర్లాండ్ (నాలుగు స్థానాలు ఎగబాకి), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (13 స్థానాలు ఎగబాకి) తమ జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచిన మ్యాచ్‌లో అర్ధ సెంచరీలు చేసిన తర్వాత సంయుక్తంగా 25వ స్థానానికి చేరుకున్నారు. ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ కిమ్ గార్త్, స్పిన్నర్ అలానా కింగ్ వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఒక్కొక్క స్థానం ఎగబాకి నాలుగు, ఐదవ స్థానాలకు చేరుకున్నారు.




## టీమ్‌ఇండియా జెర్సీ స్పాన్సర్ల లిస్ట్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్ క్రికెట్ జట్టుకు ప్రముఖ టైర్ల తయారీ సంస్థ అపోలో జెర్సీ స్పాన్సర్?గా ఖరారైంది. అపోలో టైర్స్ జెర్సీ స్పాన్సర్ హక్కులను దక్కించుకుంది. 2028 వరకు భారత్ ఆడే మ్యాచ్‌లకు జెర్సీ స్పాన్సర్‌గా అపోలో టైర్స్ వ్యవహరించనున్నట్లు రీసెంట్?గా బీసీసీఐ ప్రకటించింది. ఇందుకోసం ఒక్కో మ్యాచ్‌కు రూ. 4.50 కోట్లను అపోలో టైర్స్ చెల్లించనుంది.ఈ క్రమంలో టీమ్‌ఇండియాకు తొలిసారి జెర్సీ స్పాన్సర్?షిప్ డీల్ ఎప్పుడు కుదిరిందో మీకు తెలుసా? అసలు భారత క్రికెట్ జట్టు జెర్సీకి తొలి స్పాన్సర్ ఎవరో తెలుసా? అలాగే ఇప్పటిదాకా ఏయే కంపెనీలు జెర్సీ స్పాన్సర్?గా వ్యవహరించాయి. ఎన్నేళ్లు స్పాన్సర్?షిప్ చేశాయి. టీమ్‌ఇండియాకు ప్రముఖ కంపెనీ ఐటిసి లిమిటెడ్ జెర్సీ స్పాన్సర్?గా వ్యవహరించింది. ఈ కంపెనీయే తొలి స్పాన్సర్ కావడం విశేషం. 1993 నుంచి 2001 వరకు దాదాపు 8ఏళ్లు ఐటిసి లిమిటెడ్ స్పాన్సర్?గా ఉంది. అప్పట్లో టెస్టుకు రూ.35 లక్షలు, వన్డేకు రూ.32 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. ఈ భాగస్వామ్యం ఎనిమిదేళ్లు అంటే 2001 వరకు కొనసాగింది. సహారా 2001 జూన్?లో సహారా ఇండియా జెర్సీ స్పాన్సర్?గా ఎంట్రీ ఇచ్చింది. టీమ్‌ఇండియా జెర్సీపై దాదాపు 12ఏళ్లు సహారా పేరే ఉంది. 2010లో మళ్లీ ఈ స్పాన్సర్?షిప్ భారీ ధరకు రెన్యువల్ అయ్యింది. అంతర్జాతీయ మ్యాచ్‌కు రూ. 3.34 కోట్లు చెల్లించేలా 2010లో అగ్రిమెంట్ కుదిరింది. సహార అసోసియేషన్ సక్సెస్‌ఫుల్‌గా రన్ అయ్యింది. దీంతోపాటు సహారా ఇండియా సంస్థ ఐపీఎల్‌నూ ఎంట్రీ ఇచ్చిది. ఐపీఎల్?లో సహారా కంపెనీ పుణే వారియర్స్ ఇండియా జట్టను సొంతం చేసుకుంది. అయితే BCCIతో వివాదాల వల్ల 2013లో అగ్రిమెంట్ ముగిసింది. 2014లో స్టార్ ఇండియా అనేక కంపెనీల నుంచి పోటీని ఎదుర్కొని, స్పాన్సర్‌షిప్ రైట్స్ పొందింది. ఈ ఒప్పందం ద్వారా బీసీసీఐ ద్వైపాక్షిక మ్యాచ్‌కు రూ.1.92 కోట్లు, ఐసీసీ మ్యాచ్‌లకు రూ. 61 లక్షలు సంపాదించింది. ఈ ఒప్పందం 2017లో ముగిసింది. రెన్యూవల్ కూడా కాలేదు. ఒప్పో మొబైల్స్ చైనా స్మార్ట్‌ఫోన్ దిగ్గజం ఒప్పో మొబైల్స్ రూ.1,079 కోట్ల రికార్డు ధరకు ఒప్పందం కుదుర్చుకుంది. బీసీసీఐ ద్వైపాక్షిక మ్యాచ్‌లకు రూ.4.61 కోట్లు అలాగే ఐసీసీ మ్యాచ్‌కు రూ. 1.51 కోట్లు అందుకుంది. అయితే, ఈ ఆగ్రిమెంట్ కేవలం రెండు సంవత్సరాలకే మార్కెటింగ్ స్ట్రాటజీలో కారణాలు పేర్కొంటు ఒప్పందం నుంచి మధ్యలోనే 2019లో వైదొలిగింది. భారతదేశ ఎడ్యుకేషన్ టెక్ లీడర్ బైజూస్ 2019 మధ్యలో ఎంట్రీ ఇచ్చింది. ఒప్పో కాంట్రాక్ట్ నిబంధనల ప్రకారమే బైజూస్ కొనసాగింది. ఈ అగ్రిమెంట్ మూడున్నర సంవత్సరాలు కొనసాగింది. ఇది 2023 మార్చిలో ముగిసింది. బైజూస్ సెప్టెంబర్ 2019 నుంచి మార్చి 2023 వరకు దాదాపు నాలుగు సంవత్సరాలు టీమ్‌ఇండియా స్పాన్సర్‌గా కొనసాగింది. భారత ఫాంటసీ స్పో ర్ట్స్ ప్లాట్‌ఫామ్ డ్రీమ్11 మార్చి 2023లో స్పాన్సర్‌గా ఎంపికైంది. 158 మ్యాచ్‌లకు రూ. 358 కోట్ల విలువైన ఈ ఒప్పందం BCCIకి ద్వైపాక్షిక మ్యాచ్‌కు రూ. 4 కోట్లు, ఐసీసీ మ్యాచ్‌కు రూ. కోటి చెల్లిం చింది. అయితే, రీసెంట్?గా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2025 ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ చట్టం కారణంగా డ్రీమ్ 11 అగ్రిమెంట్ నుంచి తప్పుకుంది. దీంతో తాజాగా అపోలో స్పాన్సర్‌గా వచ్చింది.

## మోడీ జీవితంపై బయోపిక్



- **నటుడు ఉన్ని ముకుందన్ పోస్ట్**

**బలగం టీవీ, హైదరాబాద్**

మలయాళం సినీ నటుడు ఉన్ని ముకుందన్.. ప్రధాని మోదీ పాత్రను పోషించనున్నారు. మోదీపై తీస్తున్న బయోపిక్‌లో అతను మోడీ రోల్ ప్లే చేయనున్నారు. అన్ని భారతీయ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. ఈ ఫిల్మ్‌కు మా వందే అని టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ పేజీల్లో పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ప్రఖ్యాత ఫిల్మ్‌మేకర్ క్రాంతి కుమార్ సీహెచ్ ఈ సినిమాను డైరెక్ట్ చేయనున్నారు.

ప్రధాని మోదీ పాత్రలో నటించనున్నానని, ఈ విషయాన్ని పంచుకునేందుకు సంతోషిస్తున్నానని, మా వందే -టైటిల్‌తో ఆ ఫిల్మ్ రిలీజ్ కానున్నదని నటుడు ఉన్ని ముకుందన్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. బుధవారం ప్రధాని మోదీ 75వ జన్మదినోత్సవం సందర్భంగా ఈ ప్రాజెక్టును ప్రకటించారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదని ఆ ఫిల్మ్‌కు ట్యాగ్‌లైన్ ఇచ్చారు. అహ్మద్‌బాద్‌లోనే పెరిగానని, తన చిన్నతనంలో మోదీని సీఎంగా చూశానని, ఆ తర్వాత 2023 ఏప్రిల్‌లో ఆయన్ను వ్యక్తిగతంగా కలుసుకున్నానని, ఆ సమయంలో మోదీపై తనకు ప్రత్యేక అభిమానం కలిగినట్లు- ముకుందన్ తెలిపారు. ఓ నటుడిగా ప్రధాని మోదీ పాత్రను పోషించడం పట్ల సంతోషంగా ఫీలవుతున్నానని, ఇది చాలా ఇన్‌స్పైరింగ్‌గా ఉందన్నారు. ప్రధాని మోదీ రాజకీయ జీవితం అసాధారణంగా సాగిందని, అయితే తాము తీయబోయే సినిమాలో మోదీని మరో కోణంలో చూపిస్తామని, తన మాతృమూర్తితో ఉన్న అనుబంధాన్ని ఆ ఫిల్మ్‌లో ఎక్కువగా ఫోకస్ చేయనున్నట్లు- నటుడు ఉన్ని ముకుందన్ తెలిపారు. ఎవరి ముందు తలవంచవద్దు అని గుజరాతీలో మోదీ చెప్పేవారని ఆయన గుర్తు చేశారు. ప్రధాన భాషల్లో మా వందే సినిమాను తీస్తామని, ఆ తర్వాత దాన్ని ప్రపంచవ్యాప్తంగా రిలీజ్‌చేయనున్నట్లు- ఆయన చెప్పారు. మోదీ బర్త్‌డే సందర్భంగా ఆయనకు విషెస్ తెలిపారు.

## లిటిల్ హార్ట్‌కు మహేశ్ బాబు ఫిదా

- **సింజిత్...ఫోన్ ఆఫ్ చేయొద్దంటూ..పోస్ట్**



చిన్న సినిమాగా విడుదలై సూపర్ హిట్ విజయాన్ని అందుకుంది లిటిల్ హార్ట్స్ ఇప్పటికే ఈ సినిమాపై ప్రశంసలు కురిపిస్తూ సినీ ప్రముఖులు పోస్ట్‌లు పెట్టారు. తాజాగా టాలీవుడ్ అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు ఈ నవ్వుల రైడ్‌కు ఫిదా అయ్యారు. చిత్రబృందాన్ని అభినందిస్తూ.. ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. సంగీత దర్శకుడు సింజిత్‌ను ఉద్దేశిస్తూ ఫన్నీ కామెంట్ చేశారు. లిటిల్ హార్ట్స్.. ఆద్యంతం సరదాగా సాగే వినోదభరితమైన సినిమా. నటీనటు-లందరూ కొత్తవారే అయినా చాలా బాగా నటించారు. అద్భుతమైన నవ్వుల రైడ్ ఈ చిత్రం. సింజిత్ నువ్వు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఎక్కడికీ వెళ్లొద్దు బ్రదర్.. ఎందుకంటే నువ్వు కొన్నిరోజుల్లో చాలా బిజీగా మారిపోతావ్ అని అన్నారు. దీంతో పాటు చిత్రబృందానికి ఆయన అభినందనలు తెలిపారు. ప్రస్తుతం మహేశ్ పోస్ట్ వైరల్ అవుతోంది. మహేశ్ ప్రత్యేకించి సంగీత దర్శకుడిని అలా అనడానికి కారణముంది. ఇటీవల సింజిత్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను మహేశ్‌కు వీరాభిమానినని చెప్పారు. మహేశ్ 'లిటిల్ హార్ట్స్' గురించి పోస్ట్ పెడితే తన ఆనందానికి హద్దులు ఉండవన్నారు. ఆ ఆనందంలో ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని వారం రోజులు ఎటైనా వెళ్లిపోతానన్నారు. అందుకే మహేశ్ తన పోస్ట్‌లో ప్రత్యేకంగా సింజిత్‌ను ఉద్దేశించి మాట్లాడినట్లు- తెలుస్తోంది.

## గుడ్ బ్యాడ్ అగ్లీపై ఇళయారాజ కేసు

**బలగం టీవీ, హైదరాబాద్**

అగ్రకథానాయకుడు అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ'ని నెట్‌ప్లిక్స్ నుంచి తొలగించారు. ఈ సినిమా విషయంలో వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు దీన్ని తొలగించినట్లు నెట్‌ప్లిక్స్ పేర్కొంది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్ కుమార్ నటించిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. థియేటర్‌లో ఆదరణ సొంతం చేసుకున్న అనంతరం మే8న నెట్‌ప్లిక్స్ వేదికగా విడుదలైంది. అయితే ఈ చిత్రంలో అనుమతి లేకుండా తన పాటలను ఉపయోగించారని ఆరోపిస్తూ ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా కోర్టులో పిటిషన్ వేశారు. ఇది కాపీరైట్ చట్టానికి విరుద్ధమని, వాటిని తొలగించాలని, పాటలు ఉపయోగించినందుకు తగిన పరిహారం ఇవ్వాలని ఇళయరాజా కోరారు. దీనిపై విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు ఆయన పాటలను సినిమాలో ప్రదర్శించొద్దంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీ-వల ఈ వివాదంపై చిత్ర నిర్మాత రవి మీడియాతో మాట్లాడుతూ.. తాము విడుదలకు ముందే అన్ని పర్మిషన్లు తీసుకున్నట్లు చెప్పారు. నిబంధనలకు అనుగుణంగా పాటలను ఉపయోగించామన్నారు.

## జాన్వీ హోమ్ బౌంట్ ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ నటులు ఇషాన్ ఖట్టర్, జాన్వీ కపూర్, విశాల్ జేత్వా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హోమ్‌బౌండ్'.. ఈ సినిమాకు నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించగా.. కరణ్ జోహార్ నిర్మించాడు. హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు మార్టిన్ స్కోర్సెస్ ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించాడు. ఈ చిత్రం విడుదలకు ముందే పలు అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి ఎట్టకేలకు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్.





## యూఏఈపై పాకిస్థాన్ విజయం

- **సూపర్-4లో భారత్‌తో పాక్ పోరు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆసియా కప్ 2025లో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో పాకిస్థాన్ గెలిచి సూపర్-4లోకి దూసుకెళ్లింది. బుధవారం యూఏఈతో జరిగిన గ్రూప్-ఏ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్ 41 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో గ్రూప్-ఏ నుంచి రెండో జట్టుగా పాకిస్థాన్ సూపర్-4లో స్థానం సంపాదించింది. దీంతో రాబోయే ఆదివారం దుబాయ్ వేదికగా భారత్‌తో మరోసారి తలపడనుంది.

ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 146 పరుగులు చేసింది. ఫకార్ జమాన్ (36 బంతుల్లో 50, 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో రాణించగా, చివర్లో షాహిన్ షా అఫ్రిది (14 బంతుల్లో 29 నాటౌట్, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడి జట్టును గౌరవప్రదమైన స్కోరుకు చేర్చాడు. ప్రత్యేకంగా చివరి ఓవర్‌లో షాహిన్ 18 పరుగులు కొట్టడం మ్యాచ్ టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. జునైద్ సిద్ధిక్ (4/14), సిమ్రంజిత్ సింగ్ (3/26) పాకిస్థాన్ బ్యాట్స్‌మెన్‌ను బాగా ఇబ్బంది పెట్టగా, ధ్రువ్ పరషర్ ఒక వికెట్ తీశాడు.

146 పరుగుల లక్ష్యాన్ని చేధించడానికి దిగిన యూఏఈ 17.4 ఓవర్లలోనే 105 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ చోప్రా (35 బంతుల్లో 35, 1 ఫోర్, 1 సిక్స్), ధ్రువ్ పరషర్ (23 బంతుల్లో 20, 1 ఫోర్) మాత్రమే కొంత ప్రతిఘటన చూపగలిగారు. షాహీన్ షా అఫ్రిది (2/16) బౌలింగ్‌లోనూ అదరగొట్టగా, హ్యారీస్ రౌఫ్ (2/19), అబ్రర్ అహ్మద్ (2/13) కీలక వికెట్లు తీశారు. సైమ్ అయుబ్, సల్మాన్ అఘా చెరో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో పాకిస్థాన్ సూపర్-4లోకి అర్హత సాధించింది. ఇప్పుడు క్రికెట్ అభిమానులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న మ్యాచ్ – భారత్ %జం% పాకిస్థాన్ ఆదివారం దుబాయ్ వేదికగా జరగనుంది.